క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: జిమ్మర్స్, గీతం ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఈనెల 21న పెదగదిలి కూడలిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఉచితంగా దంత పరీక్షలు, సాధారణ పరీక్షలు, రక్తపోటు, ఈసీజీ, మధుమేహం పరీక్షలతో పాటు గర్భిణులు, శిశువు ఆరోగ్య సమస్యలు పరిశీలిస్తారు. కంటి పరీక్షలు, మందులు పంపిణీ చేస్తారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మల్టీపర్పస్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. రేసవానిపాలెంలోని కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీహెచ్‌ఈవో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగా అప్పారావు, జిల్లా అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. బాబి, ఎంహెచ్‌పీఈవో నాయకులు నాగభూషణం, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెలగ సామాజిక వర్గం భేటీ



మహా సభలో పాల్గొన్న తెలగ సామాజిక వర్గ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అఖిల భారత తెలగ సామాజిక వర్గం జాతీయ మహా సభను శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ నాయకులు, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ మహాసభలో పాల్గొన్నారు. సామాజిక వర్గం అభ్యున్నతికి చర్యలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కోసం చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర అఖిల తెలగ సంఘం అధ్యక్షుడు పెబ్బులి రవి కుమార్, కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం



పూలతోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణలో కైలాసనాథుని ఆలయం

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరి కొండపై కొలువైన కైలాసనాథుని ఆలయం 73వ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఈ ఆలయం వార్షికోత్సం సందర్భంగా అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని పూలతోరణాలు, విద్యుత్ దీపాలతో శనివారం అలంకరించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటలు నుంచి అభిషేకాలు, పూజ లు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కె.కాశీస్వామి తెలిపారు. ఉదయం 10 గంటలకు కోలాటం, భజనలు, మధ్యాహ్నం 12.15 గంటలకు అన్నసమారధన, 3 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు స్వామి భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు బీచ్‌రోడ్డులో వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: జాతీయ బాలిక వారోత్సవాలు సందర్భంగా ఆదివారం వాక్‌థాన్ నిర్వహించనున్నారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు చైల్డ్ రైట్స్ అండ్ యూ సంస్థ సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రోబర్ట్స్ తెలిపారు. బాలికల ఆరోగ్యం, విద్యా హక్కుపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టడం, సమాన హక్కు కల్పించడంపై చైతన్యం పొందేలా వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



అండగా 'అమ్మఒడి'

- విద్యార్థులకు బంగారు భవిష్యత్తు
- జోన్–3 పరిధిలో 21,457 మంది విద్యార్థులకు లబ్ధి
- ఏటా తల్లుల ఖాతాల్లో రూ.32.19 కోట్లు జమ



పాఠశాల విద్యార్థులు

జోన్–3 పరిధిలో వార్డుల వారీగా అర్హులైన విద్యార్థులు

వార్డు	విద్యార్థులు సంఖ్య	వార్డు	విద్యార్థులు సంఖ్య
		20	1,457
		21	1,116
14	1,189	22	2,962
15	1,087	23	1,150
16	1,158	24	1,290
17	1,463	25	2,531
18	1,503	26	1,131
19	1,597	27	1,823

ఎంవీపీకాలనీ : పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో 'అమ్మ ఒడి' పథకం సరికొత్త వెలుగులు నింపుతోంది. పిల్లలను ఉన్నతంగా చదివించాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత సరిపోక వెనుకంజ వేసిన వేల మంది తల్లిదండ్రులకు బాసటగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో నివసిస్తున్న అనేక మంది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. దీంతో నవరత్నాలతో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమ్మఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమ్మఒడి పథకం ద్వారా ఏటా పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి ఖాతాలో రూ. 15 వేలు వేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ ప్రభుత్వ లక్ష్యం..

బడిఈడు పిల్లలు ఎవరూ ఆర్థిక ఇబ్బందులు కారణంగా స్కూల్‌కి దూరం కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆర్థిక స్తోమత లేక పిల్లలను బడి మానిపిస్తున్న తల్లిదండ్రులకు భరోసా కల్పించేలా అమ్మఒడి పథకాన్ని రూపొందించారు. పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలో ఏటా రూ.15 వేలు జమ చేస్తోంది. ఆ నగదును పిల్లల బడి చదువుకు వినియోగించేలా మార్గదర్శకాలు రూపొందించింది. నాలుగేళ్లుగా ఈ పథకం నిర్విరామంగా కొనసాగుతోంది.



జోన్–3 పరిధిలో అర్హులు 21,457

జోన్–3 పరిధిలో అమ్మఒడి పథకం ద్వారా 21,457 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. మొత్తం రూ.32.19 కోట్లు నిధులు అందజేస్తున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి నిధులను ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమచేయనుంది.



అమ్మఒడి పథకం కోసం తల్లులకు మ్యాపింగ్ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటాం



నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దర్నీ బడికి పంపించి చదివిస్తున్నాను. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే ఇల్లు మంజూరు అయ్యింది. సున్నా వడ్డీ రుణాన్ని కూడా పొందుతున్నా. గతంలో ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా యువత ఉన్నత విద్యకు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలు వేశారు. ఆయన బాటలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం పేద విద్యార్థులకు వరంగా మారింది. వైఎస్సార్ కుటుంబానికి మేము రుణపడి ఉంటాం.

– మారుపల్లి దేవి, లబ్ధిదారు

పిల్లలకు బంగారు భవిష్యత్తు



అమ్మ ఒడి పథకం ద్వారా మా పిల్లలకు బంగారు భవిష్యత్ లభించనుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా అమ్మాయి చదువుకు అమ్మ ఒడి ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోంది. అబ్బాయికి జగనన్న విద్యాదీవెన లభించింది. విదేశాల్లో చదవడానికి ఆర్థిక భరోసా కోసం జగనన్న విదేశీ విద్యకు సైతం దరఖాస్తు చేయడం జరిగింది. దీంతో పాటు ఆసరా, సున్నా వడ్డీ రుణం వంటి లబ్ధిని ప్రభుత్వం ద్వారా పొందుతున్నాను. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తల్లిదండ్రులుగా మా పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాము.

– పాడి పద్మ, లబ్ధిదారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పాత ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లో సామాజిక భవన నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికుల అవసరం కోసం రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో సామాజిక భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులు త్వరగా జరిపించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. ఇప్పటికే ఈ వార్డులో కొన్ని రూ.కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గెడ్డలు ఆధునికీకరణ, రోడ్లు, కాలువులు, సామాజిక భవనాలు, కల్వర్టులు నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలోను జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాధ్యమైందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానిక పెద్దలు కొల్లి అప్పరావు, ఒమ్మి పోలారావు, ఉప్పిలి చిన్నారావు, కొల్లి అప్పలనాయుడు, వెంకటరమణ, రమణ, మహిళలు పాల్గొన్నారు.

25 నుంచి ఓపెన్ చెస్ టోర్నమెంట్

ఎంవీపీకాలనీ: ఈ నెల 25వ తేదీ నుంచి ఎంవీపీ కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. అన్ని వయసుల వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ బాబూరావు వెల్లడించారు. ఆసక్తి గల వరకు 99899 71232 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సుందర్‌నగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ప్రజలు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదో వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి ఆయన వార్డులో 24, 25, 26 నంబర్ల సచివాలయాల పరిధి ఎస్.ఐ.జి నగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్ ఆదర్శనగర్‌లలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో అమలు జరుగుతున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలను ప్రజలకు అందించారు. వాటివల్ల చేకూరిన లబ్ధిని స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. వారితో పాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వీధి దీపాలు సరిగా వెలగకపోవం, అపారిశుద్ధ్యం తదితర సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బీసీ విభాగం డైరెక్టర్ కె.ఆర్ పాత్రుడు, స్థానిక నాయకులు పతివాడ కనకరాజు, బొండా శ్రీనివాసరావు, చలం, కె.ప్రసాద్, చింతా శ్రీనివాస్, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాహక్కును మేనిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఎంవీపీకాలనీ: బాలల విద్యాహక్కును రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోల్లో చేర్చాలని బాలవికాస్ ఫౌండేషన్ ఎన్‌జీవో సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. బాలల విద్యాహక్కుపై ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో శనివారం రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్, వైజాగ్ ఎన్జీవో ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పిల్లల భవిష్యత్‌కు, విద్యారంగానికి ఏం చేస్తాయో ముందుగానే ప్రకటించాలన్నారు. ఆ దిశగా సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జాతీయ సంపద అయిన బాలలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వాలతో పాటు రాజకీయ పార్టీలు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ప్రజ్ఞాన్ కుమార్, రాంగోపాల్, సాయి వంశీ, డాక్టర్ పీకే జోష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహనభరితం కూచిపూడి నాట్య విన్యాసం



కళాకారిణిని అభినందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



నాట్యంతో అలరించిన నాట్యభూషణ్ గురు ఉదయ్ శంకర్ పొట్నూరి

మద్దిలపాలెం : కూచిపూడి నాట్య విన్యాసం సమ్మోహనభరితంగా సాగింది. అంబికేశ్వర కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాన్ని శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని కళాకారులను సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీసంప్రదాయాలను కాపాడేవి నాట్యకళలేనన్నారు. నాట్యభూషణ్ గురు ఉదయ్ శంకర్ పొట్నూరి నాట్య విన్యాసం అందరికి మంత్రముగ్ధులను చేసింది. చక్కని, హావభావాలతో దశవతారాల నాట్యం ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్యలో ప్రారంభానికి ముస్తాబైన రామాలయం గురించే దేశం మొత్తం మాట్లాడుకుంటున్న శుభ తరుణంలో ప్రత్యేకించి చిన్నారులను ఈ సంబరాలలో భాగస్వాములు చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణచిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ. 1,116 బహుమతిగా అందించడంతో పాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీసులతో కూడిన ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పల నరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఎవరైనా, ఏ ప్రాంతం నుంచైనా అయినా వారి ఇంట్లోనే ఉండి ఈ పోటీలో పాల్గొనవచ్చని అప్పలనరసయ్య తెలిపారు. బాల రాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని, పేరు, ఊరు, చదువుతున్న తరగతి రాసి ఫొటో తీసి ఈనెల 21వ తేదీలోపు సెల్ నంబర్ 81256 74182కు వాట్సప్ ద్వారా పంపాలని ఆయన కోరారు.

మరింత అందంగా ముడసర్లోవ పార్కు



ముడసర్లోవ పార్కులో నీటిశుద్ధి గేలరీని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: ముడసర్లో పార్కు పునరాభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మితో కలిసి ఆయన శనివారం ముడసర్లోవ పార్కును సందర్శించారు. ఇక్కడ పార్కు, పిల్లల ఆటపరికరాలు, నీటిశుద్ధి గేలరీ, రోజ్‌గార్డెన్‌ను పరిశీలించారు. పార్కు విస్తీర్ణం, గతంలో దీని వైభవాన్ని తెలుసుకున్నారు. ఇక్కడ నీటిశుద్ధి గేలరీ ద్వారా ఎంత నీరు వడపోత జరుగుతుంది, దాని ద్వారా ఎంత నీటిని ఏఏ ప్రాంతాలలో ప్రజలకు సరఫరా చేస్తున్నారో నీటి సరఫరా ఏఈ అప్పాజీని అడిగి తెలుసుకొన్నారు. ఈ గేలరీలో నీటి నిల్వలు కారణంగా దోమలు వృద్ధి చెందకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోజ్‌గార్డెన్‌లో వేసిన టింట్లు వారాలు తరబడి తొలగించకుండా ఉండడాన్ని పరిశీలించిన ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తొలగించి శుభ్రం చేయించాలని ఏఈకి సూచించారు. ఈ పార్కు అబివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ముడసర్లోవ పార్కును అంచెలంచెలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉండే చెట్లను నాశనం చేయకుండా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సహజసిద్ధంగా ఉన్న ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. దీని కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. టెండరు ప్రక్రియ ద్వారా దీని అభివృద్ధి పనులు జరుపుతామన్నారు. ఇందులో అందమైన మొక్కలతో గార్డెన్లు ఏర్పాటు చేయడం, యోగా ఆవరణ, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, కెఫెటేరియా, వాటర్ ఫౌంటైన్‌లు, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, హార్స్ రైడింగ్, విశ్రాంతి స్థలం, తదితర సదుపాయాలతో పార్కును రూపొందించనున్నట్లు వివరించారు. ప్రజలకు, ఇక్కడకు వెళ్లే సందర్శకులకు ఆహ్లాదంగా ఉండేవిధంగా దీన్ని పునరాభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడ రిజర్వాయరు, పార్కును సందర్శించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, హార్టికల్చర్ అధికారి గాజిబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు.


విద్యారంగానికి ఆళ్వార్‌దాస్ సేవలు చిరస్మరణీయం



ఆళ్వార్‌దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యాసంస్థల ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: విద్యారంగం అభివృద్ధికి ఆళ్వార్‌దాస్ వేసిన బాటలు చిరస్మరణీయమని ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఆళ్వార్‌దాస్ 21వ వర్ధంతిని పురస్కరించుకొని ఎంవీపీకాలనీలోని ఆయన విగ్రహానికి శనివారం విద్యాసంస్థలు, వాకర్స్ ఇంటర్నేషనల్, వాకర్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆళ్వార్‌దాస్ విద్యా రంగం అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. శ్రీనివాస విద్యాపరిషత్, శ్రీ వెంకటేశ్వ విద్యాపీఠం, శ్రీ బాలాజీ విద్యా పరిషత్ వంటి సంస్థలకు ఆయన వ్యవస్థాపకుడిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపార వేత్త ఏఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు సుంకరి రవీంద్ర, ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల ప్రతినిధులు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు



వీసీని అభినందిస్తున్న పీతల గోవింద్



శుభాకాంక్షలు తెలుపుతున్న గుడ్ల సత్యారెడ్డి



ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

బీచ్‌రోడ్డు/మద్దిలపాలెం: ఆంధ్రయూనివర్సిటీకి రెండోసారి వైస్‌చాన్సలర్‌గా నియమితులైన పీవీజీడీ ప్రసాద్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తున్నాయి. శనివారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జి పల్లా దుర్గారావులు వేర్వేరుగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే జీవీఎంసీ 23వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, తదితరులు వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఏయూ క్యాంపస్ : ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతిగా రెండో బాధ్యతలు చేపట్టిన ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ అభినందించారు. శనివారం ఏయూలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ప్రసాదరెడ్డిని కలిసి శ్రీ వత్సవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్, కాశ్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి ప్రవాహంతో సముద్ర జలాల కలుషితం



సముద్ర జలాల్లో కలుస్తున్న మురుగును పరిశీలిస్తున్న జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ: నగరంలోని మురుగు నీరు నేరుగా సముద్రంలో కలవడంతో సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని ఎంపీ జీవీఎల్ నరసింహరావు అన్నారు. బీజేపీ విశాఖ శాఖ ఆధ్వర్యంలో సాగర ఘోష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 19వ వార్డు పరిధిలోని జాలరి ఎండాడ, పెదజాలరిపేట ప్రాంతాల పరిధిలోని తీర ప్రాంతాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన విశాఖ నగరంలో సాగర జలాలు పెద్ద ఎత్తున కలుషితం కావడం బాధాకరమన్నారు. దీనికి ప్రత్యామ్నాయ చర్యలపై జీవీఎంసీ దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

సేద్యానికి సాంకేతిక సాయం

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోలు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మధరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.